TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 260 | సోమవారం ,మే 26 ,2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# ఆ రాష్ట్రాల అనుభవాలు వింటుంటే అద్భుతంగా ఉంది: ప్రధాని మోదీ ట్వీట్




- ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎం, డిప్యూటీ సీఎంలతో ప్రధాని మోదీ సమావేశం ఢిల్లీలో నిర్వహించబడింది.
- మోదీ ఈ సమావేశంపై 'ఎక్స్' (ట్విటర్) వేదికగా స్పందించి, నీటి సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, క్రీడలు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు.
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజల వరకు పథకాలను సమర్థవంతంగా చేర్చాలని ప్రధాని సూచించారు.
- ఉత్తమ పాలనా పద్ధతులను అవలంబించాలి అని మోదీ నేతలకు సూచించారు.
- కుల గణన వెనుకబడిన వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందన్న అభిప్రాయాన్ని పంచుకున్నారు.
- ఆపరేషన్ సిందూర్ విజయాన్ని దేశీయ రక్షణ సాంకేతికత విజయంగా మోదీ అభివర్ణించారు.

దిల్లీ: ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో దిల్లీలో జరిగిన సమావేశం ముగిసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా వారితో కలిసి దిగిన ఫొటోను షేర్ చేసిన ఆయన ఈ కీలక భేటీలో చర్చించిన అంశాల సారాంశాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "దిల్లీలో ఎన్డీయే సీఎంల కాంక్లేవ్‌లో పాల్గొన్నా. అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించాం. నీటి సంరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, అడ్మినిస్ట్రేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయడం, విద్య, మహిళా సాధికారత, క్రీడలు, తదితర విభిన్న రంగాల్లో చేపడుతున్న ఉత్తమ పద్ధతులను ఆయా రాష్ట్రాలు ప్రదర్శించాయి. ఈ అనుభవాలను వినడం చాలా అద్భుతంగా ఉంది" అన్నారు.

దేశాభివృద్ధికి ఊతం ఇవ్వాల్సిన కీలక ఆవశ్యకతను గుర్తు చేసిన ప్రధాని.. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు చేపట్టే పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చూడాలని సూచించారు.

## పాక్ వంకర తోకను కత్తిరిస్తాం.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సనత్‌నగర్‌లో ప్రజలతో కలిసి ప్రధాని మోదీ 122వ "మన్ కీ బాత్" ఎపిసోడ్‌ను వీక్షించారు.
- మోదీ చెప్పిన స్వచ్ఛత, యోగా, డయాబెటీస్ వంటి విషయాలను ఆచరణలోకి తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
- "మన్ కీ బాత్" ప్రజలను జాగృతం చేస్తుందని, ఐక్యంగా నిలబెడుతుందని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.
- ప్రధాని చేసిన సూచనలు, సలహాలు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆచరించాలని కోరారు.

మిగతావి 2లో

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ భేటీ



దిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ ముగిసింది. పీసీసీ కార్యవర్గం కూర్పు పై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. దాదాపు గంట పాటు సాగిన భేటీలో రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. రేపు మరోసారి కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ కానున్నారు.

## అన్న ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే కవిత లక్ష్యం: భాజపా ఎంపీ లక్ష్మణ్



భారాసలో ఎలాంటి కోటరీ ఉందో ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు.

2లో..

## జపాన్‌ను అధిగమించి..

నాలుగో ఆర్థిక శక్తిగా భారత్: నీతి ఆయోగ్ సీఈఓ





2లో..




రోహిణికార్తెలో ఎండలు రోళ్ల పగిలేలా ఉంటాయని నానుడి . సూర్యభగవానుడు రోహిణి నక్షత్రంలో ఉన్న సమయంలో రోజు రోజుకు వేడి పెరుగుతుంది. ఈ కాలంలో ఎండలకు రోళ్ళు, రోకళ్ళు పగులుతాయని పెద్దలు చెప్పిన విషయం మన మనలో మెదలాడుతూ ఉంటుంది. ఈ ఏడాది రోహిణి కార్తె మే 25 న ప్రారంభమైంది. అయితే ఈ ఏడాది అకాల వర్షాలు, అల్పపీడనం కారణంగా వేసవి కాలం.. వర్షాకాలంగా

2లో..



## మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

2లో..

# కవిత లేఖ.. కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు.



సిద్దిపేట: భారాస అధినేత కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ప్రత్యేకంగా కలిశారు. ఎమ్మెల్సీ కవిత లేఖ, అనంతర వ్యాఖ్యలు, సంబంధిత పరిణామాలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండో తేదీన నిర్వహించబోయే కార్యక్రమాలపై చర్చించనున్నట్లు సమాచారం.

# సంపాదకీయం

## అన్నాచెల్లెళ్ల వార్

అనగనగా రాజకీయాల్లో ఇద్దరు అన్నలు.. వారికి చెరో చెల్లి ఉన్నారు. ఆ ఇద్దరు అన్నల తండ్రులు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. షరా మామూలే.. తండ్రుల అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపదను పోగేసుకున్నారు. సహజంగానే సంపద కోసం అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. రక్తం పంచుకు పుట్టిన వాళ్లు బద్ధశత్రువులయ్యారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. తెలుగునాట వర్తమాన రాజకీయాలలో ఇదొక రసవత్తర ఘట్టం. ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో చెలరేగిన కలహాలను ఇప్పటిదాకా చూశాం.. చూస్తున్నాం. తెలంగాణ రాజకీయాలలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబంలో అదే సీన్ రిపీట్ కాబోతున్నది. తండ్రుల వల్ల సంక్రమించిన అధికారం, సంపదలో కుమార్తెలకు వాటా దక్కకపోవడం ఆ చెల్లెళ్ల ఆగ్రహానికి కారణమైంది. ఎన్టీఆర్ హయాంలో ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తండ్రులు అధికారంలో ఉన్నప్పుడు అన్నల చేతికి రాఖీలు కట్టి తమ మధ్య ఉన్న రక్త సంబంధాన్ని చాటి చెప్పినవాళ్లే ఇప్పుడు ఆ అన్నల ద్రోహాన్ని బయటపెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆస్తుల పంపకంలో తనకు అన్యాయం చేస్తున్నారనీ, కోరుకున్న రాజ్యసభ సీటు కూడా ఇవ్వకుండా నిరాదరణకు గురిచేశారంటూ షర్మిల తిరుగుబాటు చేయడం చూశాం. ఈ ఆస్తుల గొడవలో తల్లి విజయలక్ష్మి కుమార్తె షర్మిలకు అండగా నిలవడం, వివాదాలు న్యాయస్థానాలకు చేరడం చూశాం. ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ కుటుంబంలో కూడా అంతఃపుర కలహాలు వీధికెక్కాయి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ వ్యవహారాల్లో అన్న కేటీఆర్‌కు ఇచ్చిన ప్రాధాన్యం తనకు ఇవ్వడంలేదన్న అసంతృప్తి చెల్లి కవితలో ఎప్పటి నుంచో ఉంది. పుండు మీద కారం రాసినట్టుగా కేటీఆర్‌కు తోడు, అప్పటి ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు పార్టీలో ప్రాధాన్యం పెరిగిపోవడాన్ని కవిత జీర్ణించుకోలేకపోయారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఒక దశలో కేసీఆర్ తలపోశారు. రేపో మాపో తాను ముఖ్యమంత్రిని కాబోతున్నానని కేటీఆర్ కూడా చెప్పుకొన్నారు. దీంతో అన్నపై పైచేయి సాధించడం ఎలా? అని కవిత అంతర్మథనం చెందారు. భారత రాష్ట్ర సమితిలో కీలక నాయకుడిగా ఉన్న హరీశ్‌రావును తనతో చేయి కలపవలసిందిగా కవిత ఒక సందర్భంలో కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని అప్పట్లోనే హరీశ్‌రావు సున్నితంగా తిరస్కరించారు. మేనమామ కేసీఆర్‌ను ధిక్కరించే సాహసాన్ని హరీశ్‌రావు చేయలేరు అని పలు సందర్భాలలో రుజువైంది. తాజాగా పార్టీలో తన ప్రాధాన్యం తగ్గిపోయి కేటీఆర్ అంతా తానై వ్యవహరించడం హరీశ్‌రావుకు రుచించలేదు. 'కిం కర్తవ్యం' ఏమిటా అని ఆయన కొన్ని రోజులుగా మథనపడుతున్నారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం నుంచి హరీశ్‌రావుకు ఆఫర్లు వచ్చాయి. అయినా ఆయన తొందరపడకుండా మౌనాన్ని ఆశ్రయించారు.

కేసీఆర్ అపాయింట్‌మెంట్ కూడా హరీశ్‌రావుకు లభించని పరిస్థితి. దీంతో ఆయన బీఆర్ఎస్‌ను వీడతారని, బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరిగింది. ఫలితంగా కేటీఆర్ ఒక మెట్టు దిగి హరీశ్‌రావు ఇంటికి వెళ్లి రాజీ కుదుర్చుకున్నారు. బావ%-%బావమరుదుల మధ్య తాత్కాలికంగా సఖ్యత కుదిరింది. ఎర్రవల్లి ఫాంహౌజ్ గేట్లు కూడా హరీశ్‌రావుకు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌కు తనయ కవిత రాసిన లేఖ లీకై కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం రాత్రి అమెరికా నుంచి తిరిగి వచ్చిన కవిత ఆ లేఖ తానే రాశానని ధ్రువీకరించారు. తాను రాసిన లేఖ లీకైందంటే పార్టీలో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చునని అన్నారు. తన తండ్రి దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. కవిత చెబుతున్న ఆ దెయ్యాలు ఎవరో ఇప్పుడు తేలాల్సి ఉంది. కేసీఆర్‌ను అంటిపెట్టుకొని ఉంటున్నవారు కేటీఆర్, సంతోష్ కుమార్ మాత్రమే. ఈ ఇరువురు కాకుండా కొంత మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో అంటకాగుతూనే ఉంటారు. అయితే రక్తం పంచుకు పుట్టిన కవిత కంటే వారి మాటలకు కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తారని భావించలేం. కేసీఆర్‌కు సన్నిహితంగా మెలిగిన బయటివారు అనతికాలంలోనే ఆయనకు దూరమవడం పరిపాటే. ఈ కారణంగా కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు కేటీఆర్, సంతోష్‌కుమార్ అని భావించాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు.. ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాలు పార్టీలో, ప్రభుత్వంలో అంతా తానే అన్నట్టుగా సంతోష్‌కుమార్ వ్యవహరించారు. ఈ పరిణామాన్ని ఒక దశలో కేటీఆర్ కూడా జీర్ణించుకోలేకపోయారు. రాజీ పడటానికి అలవాటుపడిన హరీశ్‌రావు ఈ పరిణామాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే కవిత మాత్రం అప్పట్లోనే తన అసంతృప్తిని దాచుకోలేకపోయారు. ఈ దశలో ఎన్నికలు జరగడం, బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడం జరిగింది. ఆ తర్వాత అటు తండ్రి వద్ద, ఇటు పార్టీలో కేటీఆర్ ప్రాధాన్యం పెరిగింది. సరిగ్గా ఈ దశలోనే ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత పేరు వెల్లడి కావడం, ఈడీ అధికారులు ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగిపోయింది. కుమార్తెను జైలు నుంచి బెయిలుపై విడిపించుకోవడానికి అప్పట్లో కేసీఆర్ చేయని ప్రయత్నం లేదు. కేటీఆర్, హరీశ్‌రావులను ఢిల్లీలో మకాం చేయించి భారతీయ జనతా పార్టీ పెద్దల వద్దకు రాయబారాలు నెరిపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమని కూడా ఆఫర్లు ఇచ్చారు. అయితే బీజేపీ పెద్దల నుంచి సానుకూల స్పందన రాలేదు. తెలంగాణ ఏర్పాటు సమయంలో అప్పటి టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని నమ్మబలికిన కేసీఆర్, రాష్ట్ర ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌కు జెల్ల కొట్టడం బీజేపీ పెద్దలకు గుర్తుకొచ్చి ఉంటుంది. బీజేపీతో రాజీ ప్రయత్నాలు ఫలించకపోయినా మిగతా నిందితులతో పాటు కవితకు కూడా బెయిల్ వచ్చింది. ఆ తర్వాత కవిత కొంత కాలం పాటు పార్టీకి దూరంగా ఉండిపోయారు. ఇటీవలి కాలంలోనే ఆమె తిరిగి ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే పార్టీలో తనకు పూర్వం లభించిన ప్రాధాన్యం కరువైంది. కేసీఆర్ కూడా ఆమెను పట్టించుకోలేదు. వరంగల్‌లో భారీగా ఖర్చు చేసి నిర్వహించిన రజతోత్సవ సభలో కూడా ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. అప్పుడు హరీశ్‌రావు కూడా రజతోత్సవ సభకు దూరంగానే ఉండిపోగా కేటీఆర్ సర్వం తానై వ్యవహరించారు. అదే సమయంలో పార్టీలో కవిత రీఎంట్రీని ప్రజలు హర్షించడం లేదని ప్రచారం చేశారు. దీంతో పార్టీలో తనకు చోటు లేదన్న అభిప్రాయానికి కవిత వచ్చారు.

పార్టీ పగ్గాలు సోదరుడు కేటీఆర్ చేతికి చిక్కితే తన పరిస్థితి ఏమిటి? అని మథనపడ్డారు. ఈ నేపథ్యంలోనే కవిత సొంత పార్టీ ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. ఈ దశలో తన కుమారుడు గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని కవిత అమెరికా వెళ్లారు. అదే సమయంలో బీఆర్ఎస్ రజతోత్సవాలను అమెరికాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ ఉత్సవాలలో పాల్గొనడానికి కేటీఆర్ అమెరికా వెళ్లబోతున్నారు. అయితే అప్పటికే అమెరికాలో ఉన్న కవితను ఈ ఉత్సవాల గురించి ఎవరూ సంప్రదించలేదు. అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ వారు కూడా ఆమెను పట్టించుకోలేదు. అదే సమయంలో రజతోత్సవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కేటీఆర్ తరఫున మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అమెరికా వెళ్లారు. సుమన్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కూడా తనకు ఇవ్వకపోవడంపై కవిత ఆగ్రహంగా ఉన్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే వరంగల్ సభ తర్వాత తండ్రి కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ గురువారం బయటకు పొక్కింది. కవిత అమెరికా నుంచి తిరిగి రావడానికి ఒక రోజు ముందు ఈ లేఖ లీక్ కావడం యాదృచ్ఛికం

## పాక్ వంకర తోకను కత్తిరిస్తాం..
## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి
ప్రధాని మన్ కీబాత్ 122 వ ఎపిసోడ్‌ను సనత్‌నగర్‌లో కేంద్రమంత్రి ప్రజలతో కలిసి వీక్షించారు. మోదీ చెప్పిన విధంగా స్వచ్ఛత, యోగా, డయాబెటీస్ లాంటి విషయాలను ఆచరణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ...మన్ కీ బాత్... ప్రజలను జాగృతం చేస్తుందని ఐక్యంగా నిలబెడుతుందని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు. ఇందులోని ప్రధాని చేసిన సూచనలు, సలహాలు ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఆచరించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరారు.

ఉగ్రవాదులు దాడిచేస్తే ప్రతి దాడి చేస్తామనే విధంగా .. మోదీ ప్రభుత్వం చేసి చూపించిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికి గులాబీపూలతో.. క్యాండిల్స్ వెలిగించి నివాళులర్పించే విధానానికి మోదీ స్వస్తి చెప్పారని ... ఒక్కరిని చంపితే వంద మందిని చంపుతామనే విధంగా పహల్గాం దాడి తరువాత పాకిస్తాన్ ఉగ్ర మూకల శిబిరాలను భారత్ ధ్వంసం చేసిందని మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

ఆపరేషన్ సింధూర్ తో గట్టి సందేశం..

ఆపరేషన్ సిందూర్ తో 9 ఉగ్రస్థావరాలను పాక్ భూభాగంలోకి చొరబడి మరీ ప్రతీకారం తీర్చుకున్నామన్నారు. ఇందులో భారత సైనికుల పాత్ర కీలకమన్నారు. ఈ ఆపరేషన్ లో విశాఖకు చెందిన ఒక సైనికుడు కూడా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి సమయంలో నిర్వహిస్తున్న తిరంగ యాత్రలు, ర్యాలీల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని దేశ ఐక్యతను చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను కూడా అంబర్ పేట్, జూబ్లీహిల్స్, నాంపల్లి, ముషీరాబాద్ లలో ర్యాలీలు నిర్వహించానని చెప్పారు. ఉగ్రదాడులపై పాక్ 'కుక్క తోక వంకర' అన్నట్లే ప్రవర్తిస్తే ఆ తోకనే కత్తిరించేస్తామని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి హెచ్చరించారు.

### అన్న ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే కవిత లక్ష్యం:
## భాజపా ఎంపీ లక్ష్మణ్

మొదటిపేజీ తరువాయి
దిల్లీ: భారాసలో ఎలాంటి కోటరీ ఉందో ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"కేసీఆర్‌ను స్వయంగా కుమార్తెనే కలిసే పరిస్థితి లేదని తెలుస్తోంది. కేటీఆర్‌ను సవాల్ చేస్తున్నట్లు కవిత లేఖ, వ్యాఖ్యలు ఉన్నాయి. కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించేది లేదని ఆమె చెప్పకనే చెప్పారు. అన్న ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే కవిత లక్ష్యమని తెలుస్తోంది. ఆమె లేఖలో కాంగ్రెస్‌పై ప్రేమ, భాజపాపై ద్వేషం కనిపిస్తోంది. సామాజిక తెలంగాణ గురించి ఆమె మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలను పదేళ్లు పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారు" అని లక్ష్మణ్ విమర్శించారు.

## మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణలపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, ఐపీఎస్ రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. వీడియోలను సైతం రికార్డు చేస్తుండటం గమనార్హం. దేశ పరువు, ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కావడంతో సీఎం నేరుగా ఎప్పటికప్పుడు విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్టు సమాచారం. కంటెస్టెంట్ లతోపాటు.. మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

### మిల్లా మాగీ ఆరోపణలివే..

'హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా' అంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణపై గౌరవం పెరిగిందని, అతిథ్యం బాగుందని మెచ్చుకుంటూనే మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలని పేర్కొన్నారు. ప్రపంచ సుందరి-2025 పోటీల నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన ఆమె ఇంగ్లాండ్ చేరిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యల్ని బ్రిటిష్ మీడియా ప్రచురించింది. ఈ కథనాలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా మోర్లే ఖండించారు. ఆ వాదనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సైతం తోసిపుచ్చారు.

## జపాన్‌ను అధిగమించి..
### నాలుగో ఆర్థిక శక్తిగా భారత్: నీతి ఆయోగ్ సీఈఓ

మొదటిపేజీ తరువాయి
ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు.

దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు.

మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని

## ఆ రాష్ట్రాల అనుభవాలు వింటుంటే అద్భుతంగా ఉంది: ప్రధాని మోదీ ట్వీట్

మొదటిపేజీ తరువాయి
ఈ భేటీలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, యువత సాధికారత, వ్యవసాయం, సాంకేతికత వంటి కీలక రంగాల్లో బలమైన వ్యవస్థను నిర్మించడంపై మాట్లాడినట్లు పేర్కొన్నారు.

### ఉత్తమ పాలనా పద్ధతులు అవలంబించండి: ప్రధాని సూచన

తమ ప్రభుత్వం చేపట్టనున్న కుల గణన దేశంలో వెనుకబడిన, అణగారిన వర్గాలను అభివృద్ధి దిశగా తీసుకొచ్చేందుకు ఓ కీలక అడుగు అని ప్రధాని మోదీ అన్నట్లు సమాచారం. 'ఆపరేషన్ సిందూర్' విజయం దేశం స్వావలంబన దిశగా సాధించిన విజయాలను పునరుద్ఘాటించిందని, ఇది దేశీయ రక్షణ సాంకేతికత కచ్చితత్వాన్ని చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో ఉత్తమ పాలనా పద్ధతులను అవలంబించాలని ప్రధాని సూచించారు.

ఈ భేటీ అనంతరం భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. 'ఎన్డీయే కూటమి కుల రాజకీయాలను నమ్మదు.. కానీ, కుల గణన వివిధ రంగాలలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుంది' అని పేర్కొన్నారు. ఈ భేటీలో సాయుధ బలగాల ధైర్యసాహసాలను, ప్రధాని మోదీ నాయకత్వ పటిమను ప్రశంసిస్తూ నేతలంతా తీర్మానం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై తీర్మానాన్ని రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, శివసేన నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రతిపాదించగా.. కులగణనపై తీర్మానాన్ని హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రతిపాదించారు.

ఆపరేషన్ సిందూర్ భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. మోదీ సాయుధ బలగాలకు మద్దతు ఇచ్చారంటూ ఆయన నాయకత్వాన్ని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్.. ఉగ్రవాదులు, వారికి మద్దతు తెలిపేవారికి తగిన సమాధానమని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పించారు. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి మొదటి వార్షికోత్సవం, సుపరిపాలన అంశాలపైనా ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది.

## కవిత లేఖ..
## కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ

మొదటిపేజీ తరువాయి
ఇటీవల కేసీఆర్‌కు, ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఆ లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ ' కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, కేటీఆర్ భేటీ అయినట్లు సమాచారం. జూన్ 1న అమెరికాలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ ఈ నెల 28న వెళ్లనున్నారు. ఈలోగా పార్టీ పరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల నిర్వహణపై కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా కేసీఆర్‌తో ఆయన చర్చించే అవకాశముంది.

## విచిత్ర వాతావరణం:
### రోహిణి కార్తెలో భారీ వర్షాలు...!

మొదటిపేజీ తరువాయి



రోహిణికార్తెలో ఎండలు రోళ్లు పగిలేలా ఉంటాయని నానుడి . సూర్యభగవానుడు రోహిణి నక్షత్రంలో ఉన్న సమయంలో రోజు రోజుకు వేడి పెరుగుతుంది. ఈ కాలంలో ఎండలకు రోళ్లు, రోకళ్లు పగులుతాయని పెద్దలు చెప్పిన విషయం మన మనలో మెదలాడుతూ ఉంటుంది. ఈ ఏడాది రోహిణి కార్తె మే 25 న ప్రారంభమైంది. అయితే ఈ ఏడాది అకాల వర్షాలు, అల్పపీడనం కారణంగా వేసవి కాలం.. వర్షాకాలంగా మారింది.

ఈ ఏడాది ( 2025) మే 25 ఆదివారం నుంచి రోహిణి కార్తె ప్రారంభమైంది. ఈ ఏడాది 8 రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేనట్లే కనిపిస్తోంది. మరో 2-3 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి అవి ప్రవేశించడంతో రోళ్లు పగిలే ఎండలు ఉండవని భావిస్తున్నారు.

ఈ ఏడాది ( 2025) వేసవికాలం తన సంప్రదాయ లక్షణాలను వదిలేసినట్లుగా కనిపిస్తోంది. రోళ్లు .. రోకళ్లు పగిలేలా ఎండలు ఉండాల్సిన పరిస్థితి .. అయితే దానికి విరుద్ధంగా వానలు కురుస్తుండటంతో విచిత్ర వాతావరణం నెలకొంది. రోహిణి కార్తెలో వానలు కురుస్తుండటంతో వేసవికాలంలో వర్షాకాలం వాతావరణం ఏర్పడింది. మే 25 న రోహిణి కార్తె ప్రారంభమైనా, తాపత్రయానికి బదులు చల్లదనమే అధికంగా కనిపిస్తోంది.

వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ... ఇప్పటికే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని ప్రకటించింది. వీటి ప్రభావంతో వేడి తగ్గిపోయి వర్షాలు కురవడంతో రైతన్నలు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్నారు. అయితే అకా వర్షాల కారణంగా భూమి సారంలో తేడా వచ్చే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ఈ మధ్య కాలంలో నెలలు నిండకుండా ప్రసవాలు జరిగినట్టు..ఈ ఏడాది (2025) నెల రోజులు ముందుగానే వర్షాకాలం ప్రారంభమైంది. ఇప్పుడు వర్షాలు పడి... సరైన సమయంలో వర్షాలు పడకపోతే పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్? పంటను సాగుచేసే వారు.. వాతావరణంలో మార్పులు ఎలా ఉన్నా.. వారి జాగ్రత్తలో వారు ఉండటం మంచిది.. మరి రోహిణి కార్తెలో

# మాణిక్ భవన్ స్కూల్ లో నిర్వహించిన ప్రతిభా పురస్కారం 2025





**- ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 25 :** నిజామాబాద్ నగరంలోని ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాణిక్ భవన్ స్కూల్ లో నిర్వహించిన ప్రతిభా పురస్కారం 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోదీ అగ్రవర్ణంలో ఉన్న పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడే విధంగా ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ తీసుకురావడం గొప్ప చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.అగ్రవర్ణ కులాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం విద్యాతోపాటు క్రీడలు, యోగ, కళా సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులు ఈ రోజుల్లో ఎక్కువ సెల్ ఫోన్ కు బంధీలు అవుతున్నారని దాని ద్వారా బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు ముఖ్యంగా తల్లి, తండ్రులు వీలైనంత వరకు పిల్లలను సెల్ ఫోన్ కు దూరంగా ఉంచాలని సూచించారు.విద్యార్థులకు చిన్నప్పటినుండే మన ఆచార అలవాట్ల గురించి హిందూ ధర్మ సంస్కృతి సాంప్రదాయాలను అలవాటు చేయాలనీ సూచించారు.అనంతరం పదోతరగతి, ఇంటర్మీడియట్, ఎంసెట్ లలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సన్మానించి మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ధన్ పాల్ శ్రీనివాస్, ఇంగు ప్రసాద్, రవీందర్, భోజ రాజు, చిరంజీవ రాజు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ లో భారత సైన్యం చూపిన వీరత్వానికి ప్రపంచ దేశాలు అశ్చర్యపోయాయి





**- అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుంది**

**- వ్యవసాయ రంగంలో భారత దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించింది**

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 25 :** భారత దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుపుతూ గొప్ప ఆర్థిక వ్యవస్థ గా ప్రపంచంలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మార్వాడిగల్లీ బూత్ నెంబర్ 43లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధన్ పాల్ ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ జాతిని ఉద్దే శించి గొప్ప సందేశాన్ని ఇచ్చారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ లో భారత సైన్యం చూపిన వీరత్వానికి ప్రపంచ దేశాలు అశ్చర్యపోయాయి అన్నారు. ఆపరేషన్ కాగర్ తో 2026 మార్చిలోగా దేశంలో నక్సలిజాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. ఎందరో జాతీయవాదులు, జవాన్ ల మృతికి కారకుడైన నంబల కేశవరావు వంటి కరుడుకట్టిన తీవ్రవాదులను హతమార్చడం వల్ల దేశ ప్రజలందరు సంబురాలు చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయ రంగంలో భారత దేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందని అన్నారు మన తెలంగాణలో సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ పరికరంతో 50 ఎకరాలలో మహిళలు పొలాలకు స్ప్రే చేసిన విధానం నిదర్శనం అన్నారు. వ్యవసాయ డ్రోన్ పరికరాలకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తూ మహిళను, యువత ను వ్యవసాయ రంగంలో ప్రోత్సాహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీతారాం పాండే, కమల్, కృష్ణ, గోపాల్, వినయ్, ధనరాజ్, మారుతి, జయ ప్రకాశ్, బాలకిషన్ ఓం అటల్ అశోక్ రఘునాథ్ చౌదరి శ్రీను పవన్ ముందడ సత్యనారాయణ నాగలా సుఖీరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**- గురువులను సన్మానించిన విద్యార్థులు**

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 25 :**



ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర కీలకం ఆట పాటలు, చిలిపి పనులు కష్టం, సుఖం ఇలా ఏదైనా కాని మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేదే ఒక స్నేహం. ఆనందం, బాల్యం,గత స్మృతులు,కరచాలనాలు, చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు, గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచి పోయి చిన్న పిల్లల కేరింతలతో శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణం కోలాహలంగా మారింది. ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హెూదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.జగిత్యాల జిల్లా బీర్పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగగా మారింది.23 సంవత్సరం తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు కొందరు,ఎక్కడెక్కడో స్థిర పడిన వారు కొందరు,ఉద్యోగాల్లో కొందరు,సహధర్మచరినిలుగా కొందరు, వివిధ స్తితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే తలంపులో ఆనాటి విద్యార్థులైన కొంత మంది విద్యార్థులకు ఆలోచన కలిగింది. ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు, తమ కుటుంబ పరిస్థితులు, నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు, పాటలు అలరించాయి.వచ్చిన పూర్వ విద్యార్థులు గురువులకు పాదపూజ,ఆత్మీయ సన్మానం చేసి సాయంత్రం వరకు అక్కడే గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం

**- పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజ్యసభ సభ్యులు కేశవరావు**

**జూబ్లీహిల్స్ ప్రతినిధి (మన వెలుగు) మే 25 :**



జూబ్లీహిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్ లో పూలే దంపతులు స్త్రీ విద్య కోసం వేసిన పునాది మరియు సంఘ సంస్కర్తగా కులం గురించి సిద్దంతాన్ని శాస్త్రీయంగా చెప్పిన దార్శనికుడు మహాత్మ జ్యోతిరావుపూలే జీవిత చరిత్ర "పూలే" సినిమాను ప్రసాద్ ల్యాబ్ లో ప్రచురించడం జరిగింది. ఈ సినిమాను వీక్షించడానికి విచ్చేసిన బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మరియు ఇతర బీసీ సంఘం నాయకులు పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్రను చూసి వారు సమాజంలో బీసీల కోసం అట్టడుగు వర్గాల కోసం వారు చేసిన కృషిని కొనియాడారు అంతేకాకుండా బీసీ కమిషన్ నెంబర్ బాల లక్ష్మి మాట్లాడుతూ ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే జ్యోతిరావు సావిత్రి పూలే చేసిన స్త్రీ విద్య వల్లే ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేయడం జరిగింది అనంతరం ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు కేశవరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే శంకర్,ఐలయ్య, శ్రీశైలం యాదవ్ తో పాటూ వివిధ జిల్లాల బీసీ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజామాబాద్ పద్మశాలి సంఘంలో హెూరాహెూరీగా ఎన్నికలు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 25 :** పద్మశాలి ఎన్నికలు హెూరాహెూరీగాజరుగుతున్నయి. వర్నీరోడ్లోని పద్మశాలి ఉన్నత పాఠశాలలో ఆదివారం పోలింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.నగరంలో మొత్తంగా 65 తర్పులు ఉండగా 5,230కు పైగా ఓటర్లు ఉన్నారు. అయితే 60 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. 4వ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





మొత్తంగా మూడు ప్యానళ్లు పోటీలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో రెండు ప్రధాన పానెల్ నుంచి అధ్యక్షులు సెక్రెటరీ జనరల్ సెక్రటరీ నిలబడగా ఒక పానెల్ ఇండిపెండెంట్ నిలబడి అధ్యక్ష పదవికి తమ అభ్యర్థులను నిలబెట్టి, ఓటర్లను ఆకర్షించేందుకు అనేక హామీలు ఇచ్చాయి.స్థానిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలియజేస్తూ, అభ్యర్థులు తమ ప్రణాళికలను ప్రజల ముందుంచారు.ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం తుది ఫలితాలు వెలువడనున్నాయి.

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కి బిఆర్ఎస్ అధినేత మాజీముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శ

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 25 :** మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను బిఆర్ ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం ఫోన్ ద్వారా పరామర్శించారు. మోకాలి నొప్పితో బాధపడుతున్న మాజీమంత్రి సత్యవతి రాథోడ్ గారు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ను



కేసీఆర్ గారు ఫోన్ ద్వార పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు, మెరుగైన వైద్యం అదించాలని డాక్టర్లకు సూచించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా కోలుకోని మళ్ళీ ప్రజా క్షేత్రంలో అడుగుపెట్టాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

## క్రీడాకారులను నెట్ స్పాన్సర్

**గొల్లపెల్లి (మన వెలుగు) మే 25 :** గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించే భాగంలో ఆదివారం రోజున జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో వాలీబాల్ క్రీడాకారులకు మాజీ సర్పంచ్ కాసారపు అరవింద్ గౌడ్ వాలీబాల్ మరియు నెట్ స్పాన్సర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి అని రాబోయే రోజులలో మండల స్థాయి జిల్లా స్థాయి క్రీడల్లో రాణించి రాఘవపట్నం గ్రామానికి మంచి పేరు



తీసుకు రావాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాసారపు ప్రవీణ్ గౌడ్, తిరుపతి గౌడ్, మల్లేశం గౌడ్ పాల్గొనడం జరిగింది.

## వాసవి కాలనీలో ప్రభుత్వ ఉద్యోగి అక్రమ నిర్మాణంపై చర్యలు శూన్యం

**- మొద్దు నిద్రలో ఏసిపి సత్యభామ, కిందిస్థాయి ఉద్యోగులు**

**- ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ప్రభుత్వానికే లక్షల్లో టోపీ**

**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) మే 25 :** సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని వాసవీ కాలనీలో ఒక ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి ప్రభుత్వానికే లక్షల్లో టోపీ పెడుతూ భారీ అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నాడు. అధికారుల అండ మెండుగా ఉండడంతో సదరు అక్రమ నిర్మాణదారుడు యదేచ్చగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు మించి అంతస్తులు అక్రమంగా నిర్మిస్తు న్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా హైకోర్టు నుంచి అధికారులకు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన ఆగని అక్రమ నిర్మాణాలు. బాధ్యత కలిగిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వారు ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు ఎందుకు తీసుకోలేకపో తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ అక్రమ నిర్మాణం వద్ద నుండి పెద్ద



మొత్తంలో ముడుపులు అందాయని అందుకే వారు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల అండ నాకు ఉన్నంతకాలం నాకేం ఇబ్బంది లేదన్నట్టుగా పలువురికి చెబుతున్న నిర్మాణదారుడు. టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా ఉన్నట్టయితే ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చేయాలే తప్ప ఇలా అక్రమ సంపాదనకు పాల్పడడం హేయమైన చర్య అని ప్రజలు ఛీ కొడుతున్నారు. ప్రజలు కట్టిన పన్నులను లక్షల్లో వేతనాలుగా తీసుకుంటూ ప్రభుత్వం కోసం ప్రజల కోసం పనిచేయాలే తప్ప వ్యక్తిగత ఆదాయం కోసం పనిచేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిజంగా బాధ్యత కలిగిన అధికారులే అయితే తమపై ఉన్న మచ్చను తొలగించుకొని వెంటనే ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులు తమ పోలాలా,బావుల దగ్గరికి పోయి రావడానికి కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్**



భువనగిరి మండలం వడపర్తి కత్వ నుండి భువనగిరి పెద్ద చెరువులోకి నీళ్లు పోయే రాచకాలపై హన్మాపురం గ్రామంలో రైతులు తమ పంట పొలాలకు పోయి రావడానికి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం రోజున భువనగిరి మండల పరిధిలోని హన్మాపురం గ్రామంలో రైతుల పొలాల మధ్య నుండి వెళ్తున్న కాలువను రైతులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం బస్వాపురం ప్రాజెక్టు నుండి వడపర్తి కత్వలోకి నీళ్లు తెచ్చి ఆ నీళ్లను కాలువ ద్వారా భువనగిరి పెద్ద చెరువులోకి పంపియడానికి రైతుల పొలాల మధ్యన నుండి కాలువను వెడల్పు లోతు చేసినప్పుడు కాల్వ అవతల భూములు ఉన్న రైతులు,వృత్తిదారులు తమ పొలాల దగ్గరికి తమ ఆవుల,మేకల,గొర్రెలు,గేదెల దగ్గరికి ఏవిధంగా వెళ్తారో నన్న విషయాన్ని పాలకులు,అధికారులు ఎందుకు గమనించలేదని ప్రశ్నించారు.దాదాపు పది మందికి పైగా రైతులు 60 ఎకరాల పైగా భూములు,చెరువు కుంట అనేక రకాలైన వ్యవసాయ భూములు కాలువ అవతలి భాగంలో ఉన్నాయని అన్నారు.తమ పంట పొలాలను సేద్యం చేసుకుని,పాలు పిండుకొని,చెరువులో మత్స్యకారుల చాపలు పట్టుకొని,గొర్ల మేకల పెంపకం దారులు తమ గొర్రెలను మేకలను పెంపడానికి చెరువులోకి వెళ్లి వస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు.మరి ఇలాంటి పరిస్థితులలో బ్రిడ్జి లేకపోతే కాలువను దాటి ఎట్లా పోయి వస్తారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం సోమ రాములు,పన్నాల భాస్కర్ రెడ్డి మరియు పొన్నాల హరినాథరెడ్డి పొలాల మధ్య నుండి వెళ్లిన కాల్వపైన తక్షణం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నర్సింహ డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ మాట్లాడుతూ రైతులకు సాగు నీరు ఇచ్చే పేరుతో తమ పంట పొలాల దగ్గరికి వెళ్లకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా అడ్డుకోవడం అడ్డంగా కాలువ తీయడం ఎట్లా కరెక్టని ప్రశ్నించారు. ఆనాడు చిన్న కాలువ ఉంటే ఆ కాలువ దాటి రైతులు,వృత్తిదారులు తమ తమ పనులను వస్తు పోతూ చేసుకునేవారని ఈనాడు పెద్ద కాలువ తీసి దానిమీద దాటడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోతే ఎట్లా అని ఆవేదన వెలిబుచ్చారు.ఇప్పటికైనా తక్షణం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని,నిర్మాణం చేపట్టే వరకు కాల్వ పనులను ఆపాలని లేకపోతే కాల్వ పనులను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని,కాల్వ పనులను చేపడుతున్న కాంట్రాక్టర్ను వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మోటే ఎల్లయ్య,శాఖ సభ్యులు దయ్యాల మల్లేశం,గ్రామ రైతులు సోమ రాములు, మల్లయ్య, అంజయ్య, రాజేష్, మహేష్, శివ, ప్రభాకర్, పద్మ, పన్నాల పద్మారెడ్డి, నర్సిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం.

- **నిర్వహిస్తున్న ఎల్కతుర్తి కమిటీ సభ్యులు...**



త్రైత సిద్ధాంత ప్రబోధా సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక ఎల్కతుర్తి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ 101 త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారాన్ని హనుమకొండ జిల్లా చింతగట్టు క్యాంపు పరిధిలోని భీమారం ఆదివారము రోజున విస్తృతంగా దైవ జ్ఞాన ప్రచారం నిర్వహించారు. ఎల్కతుర్తి కమిటీ సభ్యులు మాట్లాడుతూ. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని. మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానమును తెలియజేస్తుంది ప్రతి ఒక్కరు కర్మయోగం విశిష్టత. త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలని ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని. జీవాత్మ. ఆత్మ. పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు. భగవద్గీతలో కర్మయోగం. బ్రహ్మయోగం భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయటపడేసి మనిషికి ముక్తిని ఇస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రబోధా సేవ సమితి ఇందు జ్ఞానవేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి, కమిటీ సభ్యులు, వెంకట్, శ్రీరామోజు సతీష్ చారి, రాకేష్ , సిద్ధార్థ్, ఆశ్రిత, క్షేత్రజ్ఞ, రాణి, జ్యోతి, రేవతి, స్రవంతి, శ్రీలత, అనూష, దివిజ, రిసాన్, మోక్షజ్ఞ, దైవ జ్ఞాన ప్రచారంలో పాల్గొన్నారు

# తహసీల్దార్ ను బెదిరించి రూ.98 వేలు కాజేసిన దుండగుడు

- **టేకులపల్లి మండలంలో ఘటన**
- **రూ.2 లక్షలు ఇవ్వకుంటే లంచం కేసులో ఇరికిస్తానంటూ బెదిరింపు**

తాను అవినీతి నిరోధకశాఖ అధికారినని, లంచం కేసులో ఇరికిస్తానని బెదిరించడంతో టేకులపల్లి తహసీల్దార్ గుర్తు తెలియని వ్యక్తికి రూ.98 వేల డబ్బు ముట్టజెప్పాడు. టేకులపల్లి తహసీల్దార్ ముత్తయ్యకు శనివారం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను అవినీతి నిరోధక శాఖ అధికారినంటూ అతడు పలకరించాడు. మీ కార్యాలయ ఆర్ఐ కొద్ది సేపటి క్రితం లంచం తీసుకుంటూ మాకు పట్టుబడ్డాడని, ప్రస్తుతం మా అదుపులో ఉన్నాడు. రూ.2 లక్షలిస్తే నిన్ను కేసులో ఇరికించకుండా వదిలేస్తా అని బెదిరించాడు. ఈ నెలాఖరుతో ఈ తహసీల్దార్ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సమయంలో కేసులు, ఇతర చిక్కులెందుకని ఆయన భయపడ్డారు. మంజుగౌరి అనే వివరాలతో ఉన్న 74832 47988 నంబరుకు నాలుగు దఫాలుగా రూ.98 వేలు పంపించారు. కాసేపటికి తేరుకోని తన గిర్దావరు ఫోన్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి కాల్ కాన్ఫరెన్స్ మీతో మాట్లాడించారు. ఏసిబీ దాడి గురించి నాకేం తెలియదని ఆయన సమాధానమిచ్చాడు. మోసగాడు చాకచక్యంగా ఇద్దరినీ బురిడీ కొట్టించాడని తహసీల్దార్ గ్రహించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదిచ్చారు. పదవి విరమణ సమయంలో ఇబ్బందులెందుకనే ఉద్దేశంతో మోసగాడు చెప్పినట్టు డబ్బు పంపించానని ఫిర్యాదులో తెలిపారు, విచారణ కొనసాగుతుంది.

# పోచమ్మ తల్లి నూతన దేవాలయ నిర్మాణ భూమి పూజ నిర్వహించిన గోలి పింగల్ రెడ్డి





బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ తల్లి నూతన దేవాలయ నిర్మాణం కొరకు ఆదివారం రోజున దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ దాత గోలి పింగల్ రెడ్డి భూమి పూజ నిర్వహించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ గాండ్ల బాలరాజ్,మాజీ జెడ్పీటీసీ భాషబోయిన పెంటయ్య ముదిరాజ్, తాజా మాజీ సర్పంచ్ కడెం లత రాజేష్ బాబు,మాజీ ఉప సర్పంచ్ రంగ కృష్ణవేణి గోపాల్ గౌడ్,మాజీ సర్పంచ్ శివగల్ల ఇస్తారి,సింగిల్ విండో మాజీ చైర్మన్ వాకిటి సంజీవ రెడ్డి,మాజీ ఎంపీటీసీ లు దేశం ముత్యాలు గౌడ్,కడెం చంద్రశేఖర్,మాజీ ఉపసర్పంచులు కడెం సాయిలు,కనకబోయిన గోపాల్,మాజీ దేవస్థాన కమిటీ చైర్మన్లు దేశం శ్రీనివాస్ గౌడ్,గార్లపాటి కృష్ణమూర్తి,జల్లి అంజయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు గౌడ్,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చీర అయిలయ్య,హైస్కూల్ మాజీ చైర్మన్ కనకబోయిన రాజమల్లేష్,మాజీ వార్డు సభ్యులు చింతల సుదర్శన్ రెడ్డి,రామిడి ఎల్లారెడ్డి,పెంటబోయిన రాము,పంజాల రమేష్ గౌడ్,కడెం జంగయ్య,భాషబోయిన రమేష్,కడెం ఉమాదేవి,పాండురంగం,దేశం శ్రీకాంత్ గౌడ్,ఆలయ అర్చకులు నేరాళ్లపల్లి ఆంజనేయ శర్మ,సురేష్ శర్మ,గ్రామ పెద్దలు బండమిది జంగయ్య గౌడ్,ఎర్కాలి బిక్షమయ్య గౌడ్,పెంటబోయిన ఎట్టయ్య,ఎర్కాలి బిక్షపతి గౌడ్,అరుముళ్ల జహంగీర్,అరుముళ్ల బాలరాజ్,పెంటబోయిన పెంటయ్య,దొడ్డి పెంటయ్య,చంద్రగాని కొండల్ గౌడ్,వాకిటి చంద్రశేఖర్ రెడ్డి,పంజాల పెద్ద శ్రీనివాస్ గౌడ్,ఉప్పల ఈశ్వర చారి,అరిగే వెంకటేష్ ముదిరాజ్, పద్మ వెంకటేష్,బొబ్బిలి అంజయ్య,పొన్న శ్రీనివాస్,చెరుకు బాలరాజ్,చెరుకు భాస్కర్,చిన్నగాళ్ల అశోక్,కడెం బీరప్ప,గాండ్ల కృష్ణ,కనకబోయిన నాగరాజ్,ఎర్కాలి వెంకటేష్ గౌడ్,వాట్నాల విజయసింహ రావు,గాండ్ల రవి,దూసరి మహేష్, చంద్రగాని నర్సింహా,బొబ్బిలి సాయి కుమార్, కడెం కిరణ్,కడెం చిన్న ఐలయ్య,అల్లదుర్గం మల్లేష్,బత్తుల చంద్రశేఖర్, దొడ్డి శ్రీనివాస్,అల్లదుర్గం యాదగిరి, పెంటబోయిన నర్సింహా,జవాజీ వెంకటేష్,ఆలయ కమిటీ సభ్యులు,ఉప్పల కృష్ణమా చారి,ఆడెపు ఆంజనేయులు,వట్నాల వెంకటేష్,అల్లదుర్గం రాజశేఖర్, రామిడి మాధవ రెడ్డి,కడెం శ్రీకాంత్, వట్నాల పవన్ కుమార్,రంగ సాయి గణేష్, బండమిది భరత్, తదితరులు పాల్గొన్నారు.

# ధారా బాలరాజు మృతి బాధాకరం: డా.కోట రాంబాబు



మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధారా బాలరాజు గుండెపోటుతో ఆదివారం నాడు అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ కోట రాంబాబు అత్కూరు గ్రామంలో వారి మృతదేహానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిబద్ధత కలిగిన నాయకుడుని కోల్పోయాము అని, వారి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.రాంబాబు వెంట యన్నం కోటేశ్వరరావు, పి ఏ సి యస్ చైర్మన్ కటికల సీతారామి రెడ్డి, మాదాల రాంబాబు, నాగిరెడ్డి, పగిడిపల్లి డేవిడ్, బండి వెంకటేశ్వర్లు, మీనుగు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# బాలరాజు పార్ధివదేహానికి నివాళు లర్పించిన డిప్యూటీ సీఎం భట్టి

- **సతీమణి మల్లు నందిని విక్రమార్క**



ఆదివారం నాడు మధిర పట్టణంలో ఆత్కూరు గ్రామంలో మల్లు భట్టి విక్రమార్క, ప్రధాన అనుచరుడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు ఆకస్మిక మరణం పట్ల దిగ్భ్రాంతికి గురైన మధిర నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మల్లు నందిని దంపతులు హుటాహుటిన హైదరాబాదు నుండి మధిర చేరుకొని బాలరాజు పార్ధివదేహానికి నివాళులర్పించి,కన్నీటి పర్యంతమయ్యారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మేమున్నామనే భరోసా ఇచ్చారు దారా బాలరాజు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న సుజాత రెడ్డిని పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పైలట్ విట్టల్ రెడ్డి




అనారోగ్యంతో బాధపడుతున్న కోటిపల్లి మండలం ఇంధోల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు తూర్పులింగారెడ్డి పెద్దమ్మ సుజాత రెడ్డిని కుమారుడు మైపాల్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి పి.విఠల్ రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీశైలం రెడ్డి వీరితోపాటు పట్లోళ్ల నరసింహులు, పాండురంగారెడ్డి, తూర్పులింగారెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,చందు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్మిట్కల్ నూతన మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన పివిఆర్ దంపతులు



ఈరోజు తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి గారి నివాసంలో కర్ణాటక రాష్ట్రం సేడం నియోజకవర్గం గుర్మిట్కల్ నూతన మున్సిపల్ చైర్మన్ శ్రీ రవీందర్ రెడ్డి పాటిల్ మరియు వారి శ్రీమతి జయశ్రీ ని పూలమాలలు వేసి శాలువలతో ఘనంగా సన్మానించిన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి తండ్రి పి విటల్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి ప్రమోదిని రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీశైలం రెడ్డి ఇట్టి కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి,మహిళా కన్వీనర్ శకుంతల,సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింలు,పాండురంగా రెడ్డి,మల్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,చందు ముదిరాజ్,శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
సోమవారం ,మే 26 ,2025

# సీఎం కావాలని రాజకీయాల్లోకి రాలేదు: కమల్‌హాసన్



అగ్ర నటుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థగ్ లైఫ్' . మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం శనివారం చెన్నై వేదికగా జరిగింది. ఇందులో పాల్గొన్న కమల్ హాసన్ సినిమాపై ఎంతో నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. తాము గొప్ప సినిమా రూపొందించామని.. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తన రాజకీయ జీవితం పై మాట్లాడారు. పదవుల మీద వ్యామోహంతో తాను పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టలేదన్నారు.

"ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. తమిళనాడు రాష్ట్ర ప్రజలకు నా వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చా. ప్రజల కోసం మేము వివిధ కార్యక్రమాలు చేస్తున్నాం. నిదానంగా అనుకున్నది సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. వాళ్లు అద్భుతంగా వర్క్ చేస్తున్నారు. అందుకు నేనెంతో గర్వపడుతున్నా. శింబు మీరు కూడా మీ వాళ్ల కోసం నిలబడాలి. వాళ్లను అలరించడం కోసం మరింత శ్రమించాలి. మా సినిమా 'థగ్‌లైఫ్' విషయంలో నమ్మకంగా ఉన్నాం. ప్రేక్షకులు తప్పకుండా మా చిత్రాన్ని ఆదరిస్తారు. శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే బయటవాళ్లకు అమ్మాను. డిస్ట్రిబ్యూషన్ మేమే చేస్తున్నాం. మేము ఒక మంచి చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులు ఆదరిస్తే.. మా నిర్మాణ సంస్థలో ఇలాంటి ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం. ఈ సినిమాలో మలయాళ నటుడు జోజూ జార్జ్ కీలక పాత్ర పోషించారు. నటీనటులు ఏదైనా కొత్తగా ప్రయత్నిస్తే.. వారిని నేను పోటీగా తీసుకుంటా. కానీ, జోజూ విషయంలో మాత్రం  అసూయ ఫీలవుతుంటా. ఆయన అద్భుతంగా వర్క్ చేస్తుంటారు. ఏది ఏమైనా నటీనటులను స్వాగతించాల్సిన బాధ్యత నాపై ఉంది" అని కమల్ హాసన్ అన్నారు. ఆయన మాటలతో జోజూ ఎమోషనల్ అయ్యారు.

**మూడు రోజులు స్నానం చేయలేదు: శివ రాజ్‌కుమార్**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ . కమల్‌తో తనకు ఉన్న అనుబంధం గురించి మాట్లాడారు. "నా చిన్నతనంలో నాన్నను కలవడానికి తొలిసారి కమల్‌హాసన్ మా ఇంటికి వచ్చారు. అక్కడే ఉన్న నా గురించి ఆయన ఆరా తీయగా.. నాన్న పరిచయం చేశారు. ఆ క్షణం ఆయన్ని ప్రేమగా హత్తుకున్నా. ఆ అనుభూతి చెదిరిపోకూడదని భావించా. మూడు రోజులపాటు స్నానం చేయలేదు. ఆయన అంటే నాకంత ఇష్టం. ఆయన నటించిన అన్ని సినిమాలు చూస్తుంటా. ఇటీవల నాకు క్యాన్సర్ ట్రీట్‌మెంట్ జరిగిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో ఉన్నప్పుడు కమల్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన మాట్లాడుతుంటే ధైర్యంగా అనిపించింది. 'శివన్నా.. నీకు తెలుసా.. నీతో మాట్లాడుతుంటే నాకెందుకో కన్నీళ్లు వస్తున్నాయి' అన్నారు. ఆ క్షణం మా నాన్నతో మాట్లాడుతున్నట్లు అనిపించింది" అని శివన్న వివరించారు.

# ప్రభాస్‌కు జోడీగా



'స్పిరిట్'లో ప్రభాస్ సరసన నటించే కథానాయిక ఎవరన్నది తేలిపోయింది. ఈ విషయాన్ని ఆ చిత్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా శనివారం సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటించారు. తన గత సినిమా 'యానిమల్'లో రెండో నాయికగా కనువిందు చేసిన త్రిప్తి దిమ్రీని ఇప్పుడు ప్రభాస్‌కు జోడీగా ఖరారు చేశారు సందీప్. ఇదొక శక్తిమంతమైన పోలీసు కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబు కానుంది. ఈ చిత్రం కోసమే ప్రభాస్ తొలిసారి పోలీసు యూనిఫాం ధరించనున్నారు. ఇందులో ఆయన మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్ధంలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. దీనికి హర్ష వర్ధన్ రామేశ్వర్ స్వరాలు సమకూరుస్తుండగా.. టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఇది తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లోనూ విడుదల కానుంది.

# మా పాపను నాన్న ఎత్తుకోవడం చూడాలని ఉంది: మనోజ్ ఎమోషనల్



తన కుటుంబం మొత్తం కలిసి కూర్చొని భోజనం చేయాలని, కౌగిలించుకుని ప్రేమగా మాట్లాడుకునే రోజు రావాలని భగవంతుడిని ప్రార్థిస్తానని నటుడు మంచు మనోజ్ తెలిపారు. 'భైరవం' ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఇచ్చిన పాడ్‌కాస్ట్‌లో ఆయన తన మనసులోని మాట బయటపెట్టారు. "నా కుమార్తెను నాన్న ఎత్తుకుంటే చూడాలనుకుంటున్నా" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని చెప్పారు."తాజా పరిణామాల రీత్యా అమ్మను ఎంతో మిస్ అవుతున్నా. అమ్మను కలవాలంటే పలు కండిషన్స్ పెట్టారు. ఆమెను కలవాలంటే పర్మిషన్ తీసుకోవాలి. లేదంటే నేను వెళ్తే ఆమె ఇంటి బయటకు వచ్చి కలవాలి. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. ఆమె కూడా మమ్మల్ని ఎంతో మిస్ అవుతుంది. అప్పుడప్పుడూ మా వద్దకు వస్తుంటుంది. మా పాప అంటే అమ్మకు ఎంతో ఇష్టం. గొడవల కారణంగా అక్కను దూరం పెట్టాను. ఇటీవల తన ఆధ్వర్యంలో జరిగిన టీచ్ ఫర్ ఛేంజ్ ఈవెంట్‌కు నేను వస్తానో రానో కూడా ఆమెకు తెలియదు. కానీ, ఆమె కోసమే వెళ్లాను. ఇంతకాలం నేను ఏమైపోతానోనని తను ఎంతో భయపడింది. దేవుడి దయ, నా పిల్లలు, అభిమానులు ఇచ్చిన ధైర్యం వల్ల నిలబడ్డా" అని ఆయన చెప్పారు."నీపై ఆధారపడి ఒక కుటుంబం ఉంది. ఎదుటివాళ్లు కత్తులతో దాడి చేయడానికి వస్తున్నారు. నీ ముందు ఒక కత్తి పడి ఉంది. అలాంటప్పుడు ఏం చేస్తావు. వాళ్లు వచ్చి దాడి చేయని ఫర్వాలేదు అని చూస్తుంటావా? లేదా నీ వాళ్ల కోసం నువ్వు కత్తి ఎత్తుతావా? ఒంటరిగా ఉన్నప్పుడు ఎన్ని అయినా పడగలవు. నా జీవితంలోనూ అదే జరిగింది. నాకంటూ మౌనిక, పిల్లలు ఉన్నారు. ఆమె జీవితంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అలాంటి బాధ ఎవరికీ రాకూడదు. ఆమెకు ఈ గొడవలతో ఏమాత్రం సంబంధం లేదు. మేము ఇప్పటివరకూ ఆస్తి అడగలేదు. మేము అడిగినట్లు నిరూపించమని అడుగుతున్నా. గొడవైన వెంటనే నాపై ఫిర్యాదు చేసి సీసీ టీవీ కెమెరాలను మాయం చేశారు. ఇది ఎప్పుడూ జరిగేదే. ఈసారి అందరికీ తెలియాలనే బయటకు వచ్చి చెప్పా. నిందలు వేసి.. వాటిని నిజమని అంగీకరించమంటే నా వల్ల కాదు. నాక్కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. తప్పు చేస్తే దాక్కుంటా. కూర్చొని మాట్లాడదాం.. గొడవలొద్దు అంటున్నా. వాళ్లు చేసే పనులకు కోపం రావడం లేదు. బాధగా ఉంటుంది. ఇంత జరిగినా వాళ్లను ప్రేమించడం తప్ప ద్వేషించ లేదు" అని మనోజ్ వివరించారు. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించిన 'భైరవం' చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.



# నాన్న కోసం 16ఏళ్ల తర్వాత!

నటన.. సంగీతం.. ఈ రెండింటినీ తన రెండు కళ్లుగా భావిస్తుంటుంది శ్రుతిహాసన్. అందుకే ఓవైపు నటనతో సినీప్రియుల్ని అలరిస్తూనే.. మరోవైపు వీలు చిక్కినప్పుడల్లా తన గాత్రంతోనూ మురిపించే ప్రయత్నం చేస్తుంటుంది శ్రుతి. ఈ క్రమంలోనే ఇప్పుడామె తన తండ్రి కమల్‌హాసన్ చిత్రం కోసం మరోసారి గళం విప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం కమల్ కథానాయకుడిగా మణిరత్నం తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. ఇందులో త్రిష కథానాయికగా నటించగా.. శింబు, జోజు జార్జ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాలో "విన్వేలి నాయకన్" అంటూ సాగే ఓ పాటను శ్రుతిహాసన్ స్వయంగా ఆలపించినట్లు చిత్ర బృందం ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఇలా కమల్ సినిమా కోసం శ్రుతి చివరిగా 16ఏళ్ల క్రితం వచ్చిన 'ఉన్నైపోల్ ఒరువన్' (తెలుగులో 'ఈనాడు')లో పాటలు పాడటం విశేషం. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'థగ్ లైఫ్'తో మరోసారి ఆ మ్యాజిక్ పునరావృతమైనట్లయింది. కమల్‌పై చిత్రీకరించిన ఈ "విన్వేలి నాయకన్' పాట సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమా.. జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించారు.

# ముగిసిన కేన్స్ ఉత్సవం.. గూచి చీరలో మెరిసిన అలియా



ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రియులు ఎంతో ప్రత్యేకంగా భావించే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరిగింది. కేన్స్ నగరం వేదికగా ఈ నెల 13వ తేదీన మొదలైన ఈ చలన చిత్రోత్సవం శనివారంతో ముగిసింది. మన దేశం తరపున పలువురు సుందరీమణులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఖరీదైన దుస్తులు ధరించి తమ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. ముగింపు రోజు అలియాభట్ సూపర్ లుక్‌లో అదరగొట్టారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ గూచి సిద్ధం చేసిన చీర ధరించి ఆమె రెడ్ కార్పెట్‌పై ఫొటోలకు పోజులిచ్చారు.

**గూచి చీరలో మెరిసిన అలియా..!**

తొలిసారి కేన్స్‌లో సందడి చేశారు నటి అలియాభట్. తొలి రోజు ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన ఫ్లోరల్ గౌనుతో ఆమె వేడుకల్లో మెరిశారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టా వేదికగా షేర్ చేస్తూ.. 'హలో కేన్స్' అనే క్యాప్షన్ జత చేశారు. చివరి రోజు ఆమె గూచి బ్రాండ్ సిద్ధం చేసిన తొలి చీరలో తళుక్కున మెరిశారు. దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. గూచి చీరకు ఫ్యాషన్ ప్రియులు ఫిదా అవుతున్నారు.

**మన తారలు ఎవరు పాల్గొన్నారంటే..:**

ఈసారి వేడుకలకు భారత్ నుంచి చాలామంది సెలబ్రిటీలు హాజరయ్యారు. మనీశ్ మల్హోత్రా డిజైన్ చేసిన చీర కట్టుకుని.. సిందూరం ధరించి ఐశ్వర్య రాయ్ ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 2002లో చీరకట్టులో కేన్స్‌లో పాల్గొన్న ఐష్.. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత భారతీయ సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగానే ఆమె సిందూరం ధరించి వెళ్లారని నెటిజన్లు భావించారు. రెండో రోజు ఆమె ధరించిన కేప్‌పై భగవద్గీత శ్లోకం ముద్రించి ఉండటం భారతీయుల మది గెలిచింది. 'హోమ్ బౌండ్' ప్రీమియర్ కోసం మహారాణి లుక్‌లో జాన్వీకపూర్ పాల్గొన్నారు. కరణ్ జోహార్, ఇషాన్ ఖట్టర్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై ఫొటోలు దిగారు. పెళ్లి కూతురు అవతారంలో మోడల్ రుచి గుజ్జర్ ఇక్కడ సందడి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలతో కూడిన నెక్లెస్‌ను ధరించి ఆకట్టుకున్నారు. మోడల్ సోనమ్ ఛబ్రా వినూత్న డిజైన్‌తో ఉన్న గౌనుతో ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. '2008- ముంబయి, 2016- ఉరీ, 2019- పుల్వామా, 2025 - పహల్గాం' అనే పదాలు గౌనుపై ఎంబ్రాయిడరీ చేసి ఉన్నాయి. వీరితోపాటు నితాన్షీ గోయెల్, అదితి రావు హైదరీ, ఊర్వశీ రౌతేలా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నాన్సీ త్యాగి, నటాషా పూనావాలా కూడా ఈవేడుకల్లో పాల్గొన్నారు.